బెదిరింపులకు భయపడి
ఏ ఉద్యమం ఆగకూడదు.
నా పత్రికా ఉద్యమం అంతే !
☛ ఎడిటర్

email: aksharabhoomignt@gmail.com
RNI NO: APBIL/2011/37440
Post Regd No. GTR/90/2025-27

అక్షరభూమి
ద్విభాషా దినపత్రిక

Publishing From Guntur. Curculated at Krishna, Prakasam, East & West Godavari, Vizag, Nellore, Kurnool, Hyderabad,Tirupathi, Ananthapuram, Kadapa

విలేఖరులు కావలెను
రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుతున్న
అక్షరభూమి
ద్విభాషా దినపత్రికకు అన్ని మండలాలకు, మున్సిపాలిటీలకు విలేఖరులు కావలెను.
బిల్లారాజు
సెల్: 72074 22333

సంపుటి : 16 సంచిక : 28 గుంటూరు ద్విబాషా దినపత్రిక (తెలుగు మరియు ఇంగ్లీష్) శుక్రవారం, 27 నవంబర్ 2026 పేజీలు : 4 వెల : రూ. 2/-

మంగళగిరిలో ఓటు వేసిన పవన్ కళ్యాణ్



మంగళగిరి, (అక్షర భూమి) : ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మంగళగిరి--తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. గురువారం ఉదయం సుమారు 11.30 గంటల సమయంలో మంగళగిరిలోని శ్రీలక్ష్మీనరసింహా కాలనీలో ఏర్పాటు చేసిన 34వ నంబర్ పోలింగ్ కేంద్రానికి చేరుకున్న ఆయన ఓటు వేశారు. ఎన్నికల ప్రక్రియలో భాగంగా సాధారణ ఓటర్లతో కలిసి పోలింగ్ కేంద్రంలోకి వెళ్లి తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎన్నికల నిబంధనలను అనుసరిస్తూ పవన్ కళ్యాణ్ పోలింగ్ కేంద్రానికి చేరుకున్నారు. ఓటర్లతో కలిసి ఓటు వేయడం ద్వారా ప్రజాస్వామ్య ప్రక్రియలో తన బాధ్యతను నిర్వర్తించారు. ఎన్నికల సందర్భంగా 2లో

భవిష్యత్ భద్రతా సవాళ్లకు ఇప్పటి నుంచే సిద్ధం కావాలి: రాజ్‌నాథ్ సింగ్

- జాతీయ రక్షణ కళాశాల 66వ కోర్సు ముగింపు వేడుకలో ప్రసంగం
- మారుతున్న భౌగోళిక రాజకీయ పరిణామాలపై అప్రమత్తత అవసరం
- తక్షణ ముప్పులను ఎదుర్కొంటూనే దీర్ఘకాలిక వ్యూహాలు
- పరిశోధనలు ఆచరణాత్మక విధాన నిర్ణయాలకు దోహదపడాలి



న్యూఢిల్లీ, (అక్షర భూమి) : మారుతున్న భౌగోళిక రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో దేశం ఎదుర్కొంటున్న తక్షణ భద్రతా ముప్పులను సమర్థంగా ఎదుర్కొంటూనే భవిష్యత్తులో ఎదుర య్యే సవాళ్లకు సిద్ధం కావడం అత్యవసరమని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. న్యూఢిల్లీలోని జాతీయ రక్షణ కళాశాల (ఎన్‌డీసీ) 66వ కోర్సు స్నాతకోత్సవం, ముగిం పు కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. అంతర్జాతీయ పరిణామాలు వేగంగా మారు తున్న తరుణంలో భద్రతా వ్యూహాలు కూడా భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని రూపొందించుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ప్రస్తుత భద్రతా పరిస్థితులను అంచనా వేయడంలో తక్షణ ముప్పులకే పరిమితం కాకుండా, రాబోయే కాలంలో తలెత్తే పరిణామాలను కూడా ముందుగానే గుర్తించాలని మంత్రి సూచించారు. అంతర్జాతీయ సంబంధాలు, ప్రాంతీయ పరిణామాలు, మారుతున్న భౌగోళిక రాజకీయ సమీకరణాలు దేశాల భద్రతా ప్రాధాన్యాలను ప్రభావితం చేస్తున్నాయని పేర్కొన్నారు. 2లో

సురక్షితంగా ఉన్న ఏడుగురు మత్స్యకారులు

కాకినాడ, (అక్షర భూమి) : కాకినాడ జిల్లాలో సముద్రంలో వేట కు వెళ్లి అదృశ్యమైన ఏడుగురు మత్స్యకారులు సురక్షితంగా ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. వారి మొబైల్ ఫోన్లకు తిరిగి సంకేతాలు అందుబాటులోకి రావడంతో ఆచూకీకి సంబంధించి కీలక సమాచారం లభించినట్లు తెలిపారు. సుబ్బంపేటకు చెందిన ఈ ఏడుగురు మత్స్యకారులు ఈ నెల 4న బోటులో సముద్రంలో చేపల వేటకు వెళ్లారు. అయితే కొద్ది రోజుల తర్వాత వారితో సంబంధాలు తెగిపోవడంతో కుటుంబ సభ్యులు, అధికారుల్లో ఆందోళన నెలకొంది. ఈ నెల 14 నుంచి మత్స్యకారులతో కమ్యూనికేషన్ నిలిచిపోయింది. అనంతరం ఈ నెల 19 నుంచి వారి బోటుతో పూర్తిగా సంబంధాలు తెగిపోయాయి. మత్స్యకారుల వద్ద ఉన్న మొబైల్ ఫోన్లతోపాటు బోటులోని ట్రాన్స్‌పాండర్ కూడా స్విచ్ ఆఫ్ కావడంతో వారి ఆచూకీ గుర్తించడం అధికారులకు సవాలుగా మారింది. సాధారణంగా బోటు కదలికలను గుర్తించేందుకు ఉపయోగించే జీపీఎస్ వ్యవస్థ ద్వారా కూడా ఎలాంటి సమాచారం లభించలేదు మత్స్యకారుల ఆచూకీ తెలియకపోవడంతో అధికారులు ఈ నెల 20 నుంచి గాలింపు చర్యలు ప్రారంభించారు. విషయం తెలుసుకున్న రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అప్రమత్తమై ప్రత్యేక చర్యలు చేపట్టింది. మత్స్యకారులను సురక్షితంగా వెనక్కి తీసుకురావడమే లక్ష్యంగా వివిధ శాఖలను సమన్వయం చేస్తూ గాలింపు కార్యక్రమాన్ని విస్తరించింది. సముద్రంలో వాతావరణం, బోటు కదలికలు, అందుబాటులో ఉన్న సమాచారాన్ని పరిగణనలోకి తీసుకుని గాలింపు కొనసాగించారు.కాకినాడ, చెన్నై, ఒడిశా ప్రాంతాలకు చెందిన కోస్ట్‌గార్డ్ అధికారుల సమన్వయంతో సముద్రంలో విస్తృతంగా అన్వేషణ చేపట్టారు. భారత నౌకాదళం, కోస్ట్‌గార్డ్ బృందాలు సంయుక్తంగా రంగంలోకి దిగి ఆపరేషన్ నిర్వహించాయి. కోస్ట్‌గార్డ్‌కు చెందిన నౌకలు, హెలికాప్టర్లను వినియోగిస్తూ పారాదీప్ తీర ప్రాంతంతోపాటు సముద్ర పరిసరాల్లో గాలింపు చేపట్టారు. బోటు ఎక్కడ ఉందనే విషయాన్ని గుర్తించేందుకు అందుబాటులో ఉన్న మార్గాలన్నింటినీ ఉపయోగించారు.

దమ్ముంటే రండి.. తొడ కొట్టి సవాల్ చేసిన సోము వీర్రాజు



రాజమహేంద్రవరం, (అక్షర భూమి) : నగరపాలక సంస్థ ఎన్నికల పోలింగ్ సందర్భంగా రాజమహేంద్రవ రంలోని మల్లయ్యపేట 62వ బూత్ వద్ద ఉద్రిక్తత చోటు చేసుకుంది. పోలింగ్ కేంద్రం వద్ద వైకాపా నేతలు ఎక్కువ మంది ఉన్నారని భాజపా ఎమ్మెల్సీ సోము వీర్రాజు అభ్యంతరం వ్యక్తం చేశారు. వెంటనే అక్కడి నుంచి వెళ్లిపోవాలని సూచించారు. పోలింగ్ కేంద్రం వద్ద అభ్యర్థి మాత్రమే ఉండాలని సోము వీర్రాజును వైకాపా నేతలు నిలదీశారు. వైకాపా నేతలు తనను ప్రశ్నించడంపై ఆగ్రహం వ్యక్తం చేసిన ఆయన..'నేను ఇక్కడే ఉంటా.. దమ్ముంటే రండి' బస్తీమే సవాల్.. అంటూ తొడకొట్టి సవాల్ చేశారు. వైకాపా నాయకుల విషయంలో పోలీసులు సరిగా వ్యవహరించడం లేదంటూ మండిపడ్డారు. ఈ క్రమంలో వైకాపా, భాజపా శ్రేణుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. అది తీవ్రస్థాయికి చేరడంతో పోలీసులు రంగంలోకి దిగి పరిస్థితి అదుపు చేశారు.

కుటుంబంతో కలిసి ఓటు వేసిన చంద్రబాబు

- ఉండవల్లిలోని పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కు వినియోగం
- మంగళగిరి--తాడేపల్లి కార్పొరేషన్ ఎన్నికల్లో భాగస్వామ్యం
- ఓటు హక్కు మాత్రమే కాదు.. బాధ్యత కూడా
- ప్రలోభాలకు లొంగకుండా ఓటు వేయాలని ప్రజలకు పిలుపు



ఉండవల్లి, (అక్షర భూమి) : మంగళగిరి--తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో భాగంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. గురువారం రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఉండవల్లిలోని పోలింగ్ కేంద్రానికి కుటుంబ సభ్యులతో కలిసి చేరుకున్న ఆయన ఓటు వేశారు. స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియలో భాగంగా తన బాధ్యతను నిర్వర్తించారు. కుటుంబ సభ్యులతో కలిసి ఓటు వేయడం ద్వారా ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాల్సిన అవసరాన్ని గుర్తుచేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు తన ఓటు వినియోగానికి సంబంధించిన వివరాలను సామాజిక మాధ్యమం ద్వారా వెల్లడించారు. రాజ్యాంగ దినోత్సవం రోజున కుటుంబ సభ్యులతో కలిసి ఉండవల్లిలో ఓటు హక్కును వినియోగించుకున్నట్లు తెలిపారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు అనేది కేవలం హక్కు మాత్రమే కాదని, ప్రతి పౌరుడిపై ఉన్న బాధ్యత కూడా అని పేర్కొన్నారు. ఎన్నికల్లో పాల్గొనడం 2లో

తిరుమల శ్రీవారికి రూ.206 కోట్ల స్వర్ణాభరణాల విరాళం

- 121 కిలోల బరువైన బంగారు ఆభరణాల సమర్పణ
- చెన్నైకి చెందిన వర్ధమాన్ జైన్ దంపతుల మహా విరాళం
- సతీసమేతంగా శ్రీవారిని దర్శించుకున్న చంద్రబాబు
- ఆభరణాల సమర్పణ కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యమంత్రి





తిరుమల, (అక్షర భూమి) : తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామికి భారీ స్వర్ణాభరణాల విరాళం అందింది. చెన్నైకి చెందిన వర ఫ్యూచర్ ఎల్ఎల్పీ సంస్థ ఛైర్మన్ వర్ధమాన్ జైన్, ఆయన సతీమణి రాధిక జైన్ దంపతులు శ్రీవారికి రూ.206 కోట్ల విలువైన బంగారు ఆభరణాలను సమర్పించారు. మొత్తం 121 కిలోల బరువున్న ఈ స్వర్ణాభరణాలను భక్తి, దాతృత్వానికి ప్రతీకగా అందించినట్లు వెల్లడించారు.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గురువారం సతీసమేతంగా తిరుమలకు చేరుకుని శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. అనంతరం వర్ధమాన్ జైన్ దంపతులు స్వామివారికి ఆభరణాలు సమర్పించే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ మహా విరాళం వివరాలను ముఖ్యమంత్రి వెల్లడించారు. వర్ధమాన్ జైన్, రాధిక జైన్ దంపతులు అందించిన ఆభరణాల విలువ రూ.206 కోట్లుగా పేర్కొన్నారు. 121 కిలోల బరువుతో ఉన్న ఈ స్వర్ణాభరణాలు శ్రీవారి ఆలయానికి అందిన భారీ విరాళాల్లో ఒకటిగా నిలిచాయి. భక్తితో స్వామివారికి ఇంతటి విలువైన కానుకను సమర్పించడం పట్ల 2లో

త్వరలో మరో 25వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తాం: సీఎం రేవంత్‌రెడ్డి



అచ్చంపేట, (అక్షర భూమి) : అచ్చంపేట బిడ్డగా ఈ ప్రాంతాన్ని చేయాల్సినంత అభివృద్ధి చేసి.. రాష్ట్రానికే ఆదర్శంగా తీర్చిదిద్దుతానని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఇందిరమ్మ చీరల పంపిణీ ప్రారంభోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం మాట్లాడారు. వీరమాంబ అచ్చమ్మ వారసత్వాన్ని ఈ నేల కొనసాగిస్తోందన్నారు. "చేసిన తప్పులకు ప్రజలకు ముఖం చూపించలేకే.. కేసీఆర్ బయటకు రావట్లేదు. కేసీఆర్‌కు అధికారం వస్తే.. కుటుంబ సభ్యులు, బంధువులకు పదవులు ఇచ్చుకున్నారు. అధికారం పోగానే.. ఫామ్‌హౌస్‌కే పరిమితం అయ్యారు. అధికారం లేకుంటే బయటకు రాకూడదా? ప్రజల తరఫున ఏమైనా అడగకూడదా? బీఆర్ఎస్‌కు పదేళ్లు అధికారం ఇస్తే.. రూ.8.50లక్షల కోట్లు అప్పులు చేసి రాష్ట్రాన్ని దోచుకున్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని దీనస్థితికి రాష్ట్రాన్ని దిగజార్చారు. గత మూడేళ్లలో దేశంలోనే అత్యధికంగా వరి పండించిన రాష్ట్రం తెలంగాణ. 25.35 లక్షల మంది రైతులకు రూ.2లక్షల వరకు రుణమాఫీ చేశాం. రైతుల కోసం ఈ మూడేళ్లలో రూ.1.78 లక్షల కోట్లు ఖర్చు చేశాం. పాలమూరు జిల్లా ప్రాజెక్టులను కేసీఆర్ పదేళ్ల పాటు పడావు పెట్టి.. కృష్ణా జలాలను జగన్‌కు రాసిచ్చారు. రోజా పెట్టిన రొయ్యల పులుసు తిని రాయలసీమ రతనాలసీమ కావాలన్నారు. పదేళ్లపాటు ప్రాజెక్టులు పూర్తి చేయకపోవటం వల్లే ఇవాళ కృష్ణా నీళ్లు ఏపీకి పోతున్నాయి. పాలమూరు జిల్లా ప్రాజెక్టులు పూర్తయి ఉంటే ఇవాళ నీళ్లు ఎత్తిపోసుకునే వాళ్లం. పాలమూరు బిడ్డగా ఈ జిల్లా ప్రాజెక్టులు పూర్తి చేయాల్సిన బాధ్యత నాపై ఉంది. గతంలో కేసీఆర్ ఇచ్చిన బతుకమ్మ చీరలను ఏ మహిళా కట్టుకోలేదు. కేజీల చొప్పున సూరత్ నుంచి తెచ్చి.. చీరల్లో కూడా అవినీతికి పాల్పడ్డారు. కేసీఆర్ ప్రభుత్వం పంచిన చీరలు చేలకు చుట్టేందుకు మాత్రమే అక్కరకు వచ్చాయి. ఇప్పటి వరకు 75వేల ఉద్యోగాలు ఇచ్చాం.. త్వరలో మరో 25వేల ఉద్యోగాలు భర్తీ చేస్తాం" అని సీఎం అన్నారు.

గాంధీ వారసులు కాంగ్రెస్‌లో ఎవరున్నారో రేవంత్‌రెడ్డి చెప్పాలి: బండి సంజయ్

హైదరాబాద్: గాంధీ వారసులు కాంగ్రెస్ పార్టీలో ఎవరున్నారో రేవంత్ రెడ్డి చెప్పాలని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ డిమాండ్ చేశారు. డూప్లికేట్ గాంధీలే తరతరాలుగా అధికారాన్ని ఏలుతున్నారని ధ్వజమెత్తారు. అంబేద్కర్ రాజ్యాంగం కల్పించిన హక్కుల వల్లే ప్రజలు స్వేచ్ఛగా జీవిస్తున్నారన్నారు. "ఎన్నికల్లో అంబేద్కర్‌ను రెండు సార్లు ఓడించింది కాంగ్రెస్ పార్టీయే. భారత రాజ్యాంగ నిర్మాతకు కాంగ్రెస్ భారతరత్న ఇవ్వలేదు. అంబేద్కర్‌ను స్మరించుకునేలా నరేంద్రమోదీ పంచతీర్థాను ఏర్పాటు చేశారు. భాజపా సంపన్న వర్గాలకే ఓటు హక్కు కల్పించాలని చూసిందని రేవంత్ రెడ్డి ఆరోపిస్తున్నారు. తెలంగాణలో ఓట్లు పోతే మీ ప్రభుత్వం ఏమి చేస్తోంది. ఓట్లు తొలగిస్తే బీఎల్ఓలను ఎందుకు అరెస్టు చేయలేదో సీఎం చెప్పాలి. పేద ప్రజలు ఒక్కటయ్యారు.. రేవంత్ రెడ్డి ఆటలు సాగవు. పేద ప్రజలను మోసం చేసి.. ఇచ్చిన హామీలను తుంగలో తొక్కారు. తెలంగాణలో భాజపాకి అధికారం ఇవ్వండి.. అభివృద్ధి చేసి చూపిస్తాం" అని బండి సంజయ్ అన్నారు.

భవిష్యత్ భద్రతా సవాళ్లకు ఇప్పటి నుంచే సిద్ధం కావాలి: రాజ్‌నాథ్ సింగ్



ఈ నేపథ్యంలో రక్షణ రంగంలో వ్యూహాత్మక ఆలోచన, ముందస్తు ప్రణాళిక, సమగ్ర దృష్టి అవసరమని వివరించారు.జాతీయ రక్షణ కళాశాలలో శిక్షణ పొందుతున్న అధికారులు, ఇతర కోర్సు భాగస్వాములు చేపట్టే పరిశోధనలు కేవలం విద్యాపరమైన పత్రాలకో, తరగతి గది చర్చలకో పరిమితం కాకూడదని రాజ్‌నాథ్ సింగ్ స్పష్టం చేశారు. పరిశోధనల ద్వారా వెలువడే కీలక అంశాలు దేశ భద్రతకు సంబంధించిన విధాన నిర్ణయాల్లో ఉపయోగపడాలని ఆకాంక్షించారు. అధ్యయనాల ఫలితాలను వాస్తవ పరిస్థితులకు అన్వయించి, అమలు చేయగల సూచనలుగా రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు. విద్యా పరిశోధనకు, ప్రభుత్వ విధాన రూపకల్పనకు మధ్య సమన్వయం పెరగాలని మంత్రి పేర్కొన్నారు. భద్రతా రంగంలో ఎదురయ్యే సంక్లిష్ట సమస్యలను లోతుగా అధ్యయనం చేయడంతో పాటు, వాటికి ఆచరణ సాధ్యమైన పరిష్కారాలను సూచించే దిశగా కోర్సు భాగస్వాములు కృషి చేయాలని సూచించారు. పరిశోధనల ద్వారా వచ్చిన ఆలోచనలు నిర్ణయాధికారులకు ఉపయోగపడినప్పుడే వాటికి విస్తృత ప్రయోజనం చేకూరుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. 66వ జాతీయ రక్షణ కళాశాల కోర్సు ముగింపు సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో భద్రతా రంగానికి సంబంధించిన అధ్యయనాలు, పరిశోధనలను కార్యాచరణ విధానాలతో అనుసంధానించాల్సిన అంశానికి ప్రాధాన్యం లభించింది. తక్షణ ముప్పులను ఎదుర్కొనే సామర్థ్యంతో పాటు భవిష్యత్ సవాళ్లను ముందుగానే అంచనా వేసే వ్యూహాత్మక దృష్టిని పెంపొందించుకోవాలని రాజ్‌నాథ్ సింగ్ పిలుపునిచ్చారు.

మంగళగిరిలో ఓటు వేసిన పవన్ కళ్యాణ్



ప్రజాప్రతినిధులు సైతం తమ ఓటు హక్కును వినియోగించుకోవడం ద్వారా ప్రజలకు ఆదర్శంగా నిలవాల్సిన అవసరాన్ని ఈ పరిణామం గుర్తుచేసింది.ఈ సందర్భంగా ప్రతి పౌరుడు ఓటు హక్కును బాధ్యతగా భావించాలని పవన్ కళ్యాణ్ పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు అత్యంత కీలకమైన హక్కు అని, ఎన్నికల్లో పాల్గొనడం ద్వారా ప్రజలు తమ అభిప్రాయాన్ని తెలియజేయాలని సూచించారు. ఓటు వేయ డం పౌరుల బాధ్యత అని, అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఎన్నికల ప్రక్రియలో భాగస్వాములు కావాలని పేర్కొన్నారు.మంగళగిరి--తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల నేపథ్యంలో వివిధ ప్రాంతాల్లో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకుంటున్నారు. ఈ క్రమంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కూడా తన ఓటు హక్కును వినియోగించుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది. పోలింగ్ కేంద్రంలో సాధారణ ఓటర్లతో కలిసి ఓటు వేయడం ఎన్నికల నిబంధనల పట్ల ఆయన అనుసరించిన విధానాన్ని తెలియజేసింది. ఇదే సందర్భంగా దేశ ప్రజలకు పవన్ కళ్యాణ్ రాజ్యాంగ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. భారత రాజ్యాంగం కల్పించిన హక్కులు, బాధ్యతలను ప్రతి పౌరుడు గుర్తుంచుకోవాలని ఈ సందర్భంగా ఆయన సందేశం ఇచ్చారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడటంలో ఓటు హక్కు వినియోగం కీలకమనే విషయాన్ని తన ఓటు ద్వారా మరోసారి చాటిచెప్పారు.

తిరుమల శ్రీవారికి రూ.206 కోట్ల స్వర్ణాభరణాల విరాళం



కార్యక్రమంలో పాల్గొన్నవారు హర్షం వ్యక్తం చేశారు. శ్రీవారి ఆలయానికి భక్తులు వివిధ రూపాల్లో విరాళాలు అందిస్తుంటారు. నగదు, బంగారం, వెండి ఆభరణాలు, ఇతర విలువైన వస్తువులను సమర్పిస్తూ తమ భక్తిని చాటుకుంటారు. ఈ క్రమంలో వర్ధమాన్ జైన్ దంపతులు సమర్పించిన 121 కిలోల స్వర్ణాభరణాలు ప్రత్యేక ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఈ విరాళం ద్వారా దాతలు శ్రీవారిపై తమకున్న భక్తిని చాటుకున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో జరిగిన ఈ ఆభరణాల సమర్పణ కార్యక్రమం తిరుమలలో ప్రత్యేకంగా నిలిచింది. రూ.206 కోట్ల విలువైన స్వర్ణాభరణాలను ఆలయానికి అందించడం పట్ల భక్తుల్లో ఆసక్తి నెలకొంది. శ్రీవారి సేవలో భాగంగా ఇంతటి విలువైన కానుకను సమర్పించిన వర్ధమాన్ జైన్ దంపతులను అభినందించారు.

ఇదో చారిత్రాత్మక ఘట్టం..

శ్రీవారికి భారీ విరాళంపై సీఎం చంద్రబాబు



తిరుమల, (అక్షర భూమి) : తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామికి ఓ భక్తుడు భారీ స్థాయిలో బంగారు ఆభరణాలను విరాళంగా సమర్పించారు. చెన్నైకి చెందిన పారిశ్రామికవేత్త వర్ధమాన్ జైన్, సుమారు రూ. 206 కోట్ల విలువైన 121 కిలోల స్వర్ణాభరణాలను శ్రీవారికి కానుకగా అందించారు. నేడు తిరుమలలో జరిగిన ఈ చారిత్రాత్మక అప్పగింత కార్యక్రమానికి సీఎం చంద్రబాబు నాయుడు హాజరయ్యారు.ఈ విరాళం వివరాలను పరిశీలిస్తే, 106 కిలోల బంగారంతో స్వామివారి అలంకరణ కోసం వజ్రాలు, రత్నాలు పొదిగిన పాదకవచాలు, కౌస్తుభం, నాగాభరణాలు వంటివి ఉన్నాయి. మిగిలిన 15 కిలోల బంగారంతో పద్మావతి అమ్మవారికి బంగారు వస్త్రాన్ని రూపొందించారు. సీఎం చంద్రబాబు సమక్షంలోనే టీటీడీ అధికారులకు వర్ధమాన్ జైన్ ఈ ఆభరణాలను అధికారికంగా అందజేశారు.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ.. భక్తుడి విరాళం ఒక చారిత్రాత్మక ఘట్టమని అభివర్ణించారు. తరతరాలుగా భక్తులు స్వామివారిపై చూపిస్తున్న అచంచల భక్తికి, విశ్వాసానికి ఈ కానుక నిదర్శనమని అన్నారు. తిరుమలలో లభించే దివ్యానుభూతి ప్రత్యేకమైనదని పేర్కొన్నారు. అనంతరం చంద్రబాబు తన అర్ధాంగి భువనేశ్వరితో కలిసి శ్రీవారిని దర్శించుకున్నారు.

జాతీయ అవార్డుల జ్యూరీ చైర్మన్‌గా నందమూరి బాలకృష్ణ, సభ్యుడిగా అల్లు అరవింద్





2025వ సంవత్సరానికి సంబంధించి జాతీయ చలనచిత్ర అవార్డుల ఎంపిక ప్రక్రియ నిమిత్తం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రత్యేక జ్యూరీ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీకి చైర్మన్‌గా ప్రముఖ సినీ నటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణను నియమిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది.ఈ ఉన్నత స్థాయి జ్యూరీ కమిటీలో సభ్యులుగా ప్రముఖ చలనచిత్ర నిర్మాత అల్లు అరవింద్, ప్రముఖ సినిమాటోగ్రాఫర్, దర్శకుడు ఎస్.గోపాల్ రెడ్డి, సీనియర్ నటి ప్రభలను నియమించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చలన చిత్ర, టెలివిజన్, నాటకరంగ అభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎఫ్‌టీవీటీడీసీ) మేనేజింగ్ డైరెక్టర్ పంపిన ప్రతిపాదనలను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాత ప్రభుత్వం ఈ కూర్పును ఖరారు చేసింది. జాతీయ చలనచిత్ర పురస్కారాల జ్యూరీ నియామకానికి సంబంధించి అవసరమైన తదుపరి చర్యలను వేగవంతం చేయాలని విజయవాడలోని ఏపీఎస్ఎఫ్‌టీవీటీడీసీ మేనేజింగ్ డైరెక్టర్‌కు ఆదేశాలు జారీ అయ్యాయి. రాష్ట్ర గవర్నర్ ఆదేశాల మేరకు సాధారణ పరిపాలన శాఖ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి (పొలిటికల్ - ఎఫ్ఏసీ) ఎస్.సురేశ్ కుమార్ ఈ మేరకు అధికారిక ఉత్తర్వులను వెలువరించారు.

కుటుంబంతో కలిసి ఓటు వేసిన చంద్రబాబు



ద్వారా ప్రజలు తమ ప్రాంతానికి సంబంధించిన నిర్ణయాల్లో భాగస్వాములు కావచ్చని వివరించారు. ప్రాంతాల అభివృద్ధికి, భవిష్యత్తు నిర్మాణానికి ఓటు ఎంతో కీలకమని ముఖ్యమంత్రి తన సందేశంలో పేర్కొన్నారు. స్థానిక సంస్థలకు జరిగే ఎన్నికల్లో ప్రజలు వేసే ఓటు తమ ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాలు, మౌలిక సదుపాయాల కల్పన వంటి అంశాలపై ప్రభావం చూపుతుందని తెలిపారు. అందువల్ల ఓటర్లు ఎన్నికల ప్రాధాన్యాన్ని గుర్తించి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. ఎన్నికల సమయంలో ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా స్వేచ్ఛగా తమ నిర్ణయాన్ని వెల్లడించాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. డబ్బు, ఇతర ప్రలోభాలకు ప్రభావితం కాకుండా తమకు నచ్చిన అభ్యర్థికి ఓటు వేయాలని సూచించారు. ప్రతి ఓటరు స్వతంత్రంగా ఆలోచించి ప్రజాస్వామ్య విలువలకు అనుగుణంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ఎన్నికల ప్రక్రియలో ప్రజల భాగస్వామ్యం పెరిగినప్పుడే ప్రజాస్వామ్య వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని పేర్కొన్నారు.ఓటు వేద్దాం.. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేద్దాం అనే సందేశంతో ముఖ్యమంత్రి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. రాజ్యాంగ దినోత్సవం రోజున ఓటు హక్కును వినియోగించుకోవడం ద్వారా పౌరులుగా తమ బాధ్యతను గుర్తుచేసుకోవాలని సూచించారు. మంగళగిరి--తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల నేపథ్యంలో ముఖ్యమంత్రి కుటుంబ సభ్యులతో కలిసి ఓటు వేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రజలు కూడా పెద్ద సంఖ్యలో పోలింగ్‌లో పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆయన కోరారు.

టీడీపీలో చేరిన వైఎస్సార్‌సీపీ కుటుంబాలు



నిమ్మాడ, (అక్షర భూమి) : శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళి మండలం అక్కయ్యవలస గ్రామానికి చెందిన ఏడు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో చేరాయి. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, ప్రజా సంక్షేమ కార్యక్రమాల పట్ల ఆకర్షితులై తాము తెలుగుదేశం పార్టీలో చేరినట్లు మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు వెల్లడించారు. గురువారం నిమ్మాడలోని తన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో కొత్తగా పార్టీలో చేరిన వారికి పసుపు కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు టీడీపీ కండువాలు ధరించి పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో గిన్ని ధనుంజయ రెడ్డి, కోళ్ల నీలకంఠ రెడ్డి, గిన్ని ధర్మారెడ్డి, కోళ్ల జనార్దన్ రెడ్డి, గిన్ని జగ్గారావు, గిన్ని ఆమాస్ రెడ్డి తదితరులు పార్టీలో చేరిన వారిలో ఉన్నారు. వీరందరికీ మంత్రి అచ్చెన్నాయుడు పసుపు కండువాలు కప్పి పార్టీ కండువాతో ఆహ్వానం పలికారు. గ్రామానికి చెందిన ఏడు కుటుంబాలు ఒకేసారి పార్టీలో చేరడం సంతోషాన్ని కలిగించిందని ఆయన పేర్కొన్నారు.కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సంక్షేమ పథకాలపై ప్రజల్లో ఆదరణ పెరుగుతోందని అచ్చెన్నాయుడు తన సందేశంలో తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి, గ్రామాల పురోగతి కోసం తెలుగుదేశం పార్టీ అనుసరిస్తున్న విధానాలపై నమ్మకంతో కొత్తగా చేరిన వారు ముందుకు రావడం అభినందనీయమని పేర్కొన్నారు. ప్రజలకు మెరుగైన పాలన అందించడంతోపాటు గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగించడమే ప్రభుత్వ లక్ష్యమని వివరించారు.పార్టీలో చేరిన నాయకులు, కుటుంబాలకు మంత్రి హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. అక్కయ్యవలస గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లేందుకు అందరూ సమష్టిగా కృషి చేయాలని కోరారు. గ్రామంలో పార్టీని మరింత బలోపేతం చేయడంతోపాటు ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి పనిచేయాలని సూచించారు. కొత్తగా చేరిన వారిని పార్టీ కార్యకలాపాల్లో భాగస్వాములను చేసుకుంటూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. అక్కయ్యవలస గ్రామ అభివృద్ధి, తెలుగుదేశం పార్టీ బలోపేతం కోసం అందరూ కలిసికట్టుగా పనిచేద్దామని అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. గ్రామస్థాయిలో పార్టీ శ్రేణుల మధ్య సమన్వయం పెంచుతూ అభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని కోరారు. కోటబొమ్మాళి మండలంలో జరిగిన ఈ చేరికల కార్యక్రమం స్థానిక రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

రాజ్యాంగ విలువల పరిరక్షణే లక్ష్యం: పల్లా శ్రీనివాసరావు



మంగళగిరి, (అక్షర భూమి) : భారత రాజ్యాంగం కల్పించిన విలువలను కాపాడుతూ ప్రజాస్వామ్య పరిరక్షణకు కృషి చేయాలని ఆంధ్రప్రదేశ్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన పార్టీ సీనియర్ నాయకులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సేవలను స్మరించుకున్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారతదేశానికి సమాన హక్కులు, న్యాయం అందించే గొప్ప రాజ్యాంగాన్ని అంబేద్కర్ అందించారని పల్లా శ్రీనివాసరావు కొనియాడారు. కుల, మత, ప్రాంత, భాషా భేదాలకు అతీతంగా ప్రతి పౌరుడికి హక్కులు కల్పించడంలో రాజ్యాంగం కీలక పాత్ర పోషిస్తోందన్నారు. దేశ ప్రజాస్వామ్య వ్యవస్థకు బలమైన పునాదులు వేసిన రాజ్యాంగ నిర్మాత సేవలను ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని పేర్కొన్నారు.రాజ్యాంగం నిర్దేశించిన విలువలను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన అన్నారు. ముఖ్యంగా బడుగు, బలహీన వర్గాలకు న్యాయం జరగడంతోపాటు వారికి అభివృద్ధి అవకాశాలు అందుబాటులోకి రావాలని తెలిపారు. సామాజిక న్యాయం, సమానత్వం, ప్రజాస్వామ్య పరిరక్షణకు రాజ్యాంగం మార్గదర్శకంగా నిలుస్తోందని చెప్పారు. రాజ్యాంగం పౌరులకు కల్పించిన అత్యంత శక్తివంతమైన హక్కుల్లో ఓటు హక్కు ఒకటని పల్లా శ్రీనివాసరావు గుర్తుచేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజల అభిప్రాయాన్ని ప్రతిబింబించే కీలక సాధనం ఓటు అని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ప్రతి పౌరుడు బాధ్యతాయుతంగా వ్యవహరించి, తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఓటు వేయడం ద్వారా ప్రజాస్వామ్య వ్యవస్థను మరింత బలోపేతం చేయవచ్చని అన్నారు.రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి, ప్రజాస్వామ్య పరిరక్షణే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని పల్లా శ్రీనివాసరావు తెలిపారు. రాజ్యాంగం ప్రసాదించిన హక్కులు, విలువలపై ప్రజల్లో మరింత అవగాహన పెరగాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు పాల్గొని రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌కు నివాళులర్పించారు.

శ్రీలంక తమిళులకు 148 కొత్త ఇళ్లు ప్రారంభం

చెన్నై, **(అక్షర భూమి)** : శ్రీలంక తమిళుల పునరావాసం, సంక్షేమానికి తమిళనాడు ప్రభుత్వం మరో కీలక చర్య చేపట్టింది. కృష్ణగిరి జిల్లాలోని పంబర్ డ్యామ్ శ్రీలంక తమిళుల పునరావాస శిబిరంలో నిర్మించిన 148 నూతన గృహాలను ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ గురువారం ప్రారంభించారు. సచివాలయంలో జరిగిన కార్యక్రమం ద్వారా ప్రజా, పునరావాస శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ గృహ నిర్మాణాలను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఇళ్ల నిర్మాణానికి రూ.8 కోట్ల 52 లక్షల 85 వేల వ్యయం చేయగా, వాటికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు మరో రూ.1 కోటి 37 లక్షల 10 వేల నిధులు ఖర్చు చేశారు. పునరావాస శిబిరాల్లో నివసిస్తున్న కుటుంబాలకు మెరుగైన నివాస సౌకర్యాలు కల్పించడమే ఈ కార్యక్రమం లక్ష్యం. కొత్తగా నిర్మించిన ఇళ్లతో పాటు శిబిరంలో నివసించే కుటుంబాలకు అవసరమైన ప్రాథమిక సదుపాయాలను కూడా ప్రభుత్వం కల్పించింది. గృహ నిర్మాణంతోపాటు మౌలిక వసతుల కోసం ప్రత్యేకంగా నిధులు కేటాయించడం ద్వారా లబ్ధిదారులకు నివాసయోగ్యమైన వాతావరణం కల్పించేందుకు చర్యలు చేపట్టింది. ప్రజా, పునరావాస శాఖ ఈ పనులను అమలు చేసింది. పునరావాస శిబిరాల్లో దీర్ఘకాలంగా నివసిస్తున్న శ్రీలంక తమిళుల జీవన పరిస్థితులను మెరుగుపరిచే ప్రభుత్వ కార్యక్రమాల్లో భాగంగా ఈ గృహాలను నిర్మించారు.ఇదే కార్యక్రమంలో శిబిరాల్లో నివసిస్తున్న శ్రీలంక తమిళులకు పెంచిన నెలవారీ నగదు సాయాన్ని పంపిణీ చేసే కార్యక్రమాన్ని కూడా ముఖ్యమంత్రి ప్రారంభించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పునరావాస శిబిరాల్లో నివసిస్తున్న 19,710 కుటుంబాలకు చెందిన 56,638 మందికి ఈ పెంచిన ఆర్థిక సాయం ద్వారా ప్రయోజనం కలగనుంది. సచివాలయంలో జరిగిన కార్యక్రమంలో భాగంగా నాలుగు కుటుంబాలకు చెందిన 16 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి స్వయంగా ఆర్థిక సాయాన్ని అందజేసి పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. నెలవారీ ఆర్థిక సాయాన్ని పెంచడం ద్వారా శిబిరాల్లో నివసిస్తున్న కుటుంబాలకు మరింత తోడ్పాటు అందించాలన్నది ప్రభుత్వ ఉద్దేశంగా ఉంది. నిత్యావసరాల కొనుగోలు, కుటుంబ నిర్వహణ వంటి అవసరాలకు ఈ ఆర్థిక సహాయం ఉపయోగపడనుంది.

అక్షరభూమి
ద్విభాషా దినపత్రిక
RNI NO: APBIL/2011/37480
Post Regd No. GTR/90/2025-27
27 శుక్రవారం నవంబర్ 2026

బాపట్ల మున్సిపల్ ఎన్నికల పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన లోక్‌సభ ప్యానెల్ స్పీకర్, బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణ ప్రసాద్



బాపట్ల(అక్షర భూమి)26.11.26 గురువారం బాపట్ల మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రక్రియను లోక్‌సభ ప్యానెల్ స్పీకర్ మరియు బాపట్ల పార్లమెంటు సభ్యులు తెన్నేటి కృష్ణ ప్రసాద్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా బాపట్ల పట్టణంలోని 7, 10, 12, 19, 20, 21, 22, 27, 33, 34, 38, 39, 40 మరియు 41 వార్డులలో పోలింగ్ బూత్‌లను ఆయన స్వయంగా సందర్శించి, పోలింగ్ జరుగుతున్న తీరును సమీక్షించారు. ఆయా కేంద్రాలలో ఓటర్లకు కల్పించిన మౌలిక సదుపాయాలు, క్యూ లైన్ల నిర్వహణ, భద్రతా ఏర్పాట్ల గురించి ఎన్నికల అధికారులు మరియు సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.

ఎన్టీఆర్ ఆహార శాస్త్ర మరియు సాంకేతిక కళాశాలలో ఘనంగా రాజ్యాంగ దినోత్సవ వేడుకలు

బాపట్ల (అక్షర భూమి) 26.11.26 బాపట్లలోని ఎన్టీఆర్ ఆహార శాస్త్ర మరియు సాంకేతిక కళాశాలలో రాజ్యాంగ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల అసోసియేట్ డీన్ బి.వి.ఎస్. ప్రసాద్ మాట్లాడుతూ దేశంలో రాజ్యాంగ ప్రాముఖ్యత, సమాజంలోని ప్రతి ఒక్కరికీ సమాన హక్కులు కల్పించడంలో రాజ్యాంగం పోషిస్తున్న పాత్ర గురించి వివరించారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్ల ప్రాధాన్యతను వివరించి, సమాజంలోని అన్ని వర్గాలకు సమాన అవకాశాలు కల్పించాల్సిన అవసరాన్ని తెలియజేశారు.అసోసియేట్ ప్రొఫెసర్ ఎన్. వినోద మాట్లాడుతూ రాజ్యాంగంలోని సౌభ్రాతృత్వం, సమానత్వ భావనలు సమాజ ఐక్యతకు, సామాజిక న్యాయానికి పునాదులని పేర్కొన్నారు. భారత రాజ్యాంగ రచనలో బి.ఆర్. అంబేద్కర్ పోషించిన కీలక పాత్రను వివరించి, రాజ్యాంగ విలువలను ప్రతి ఒక్కరూ గౌరవించి, వాటిని ఆచరణలో పాటించాలని విద్యార్థులకు సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో రాజ్యాంగ ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో సహాయ ఆచార్యులు సి.హెచ్. సోమేశ్వరరావు, ఇ. గౌతమి, బోధనా సహాయకులు ఎస్. వినోద్ బాబు, కె. వినయ్ ప్రమోద్, జి.ఎం. వినయ్, ఎ. దివ్యశ్రీ తదితరులు పాల్గొన్నారు.

14వ వార్డులో కుటుంబ సమేతంగా ఓటు వేసిన ఎమ్మెల్యే నరేంద్ర వర్మ



బాపట్ల (అక్షర భూమి) 26.11.26 బాపట్ల మున్సిపల్ ఎన్నికల పోలింగ్ సందర్భంగా పట్టణంలోని 14వ వార్డులో బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ కుటుంబ సమేతంగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. సామాన్య ఓటర్లతో పాటు పోలింగ్ కేంద్రానికి విచ్చేసిన ఆయన, తన కుటుంబ సభ్యులతో కలిసి ఓటు వేశారు.

ఎమ్మెల్యే జూలకంటికి బాల నాగేంద్రస్వామి ఉత్సవాలకు ఆహ్వానం..!

ఆహ్వానించిన ధర్మవరం ఆలయ కమిటీ సభ్యులు
ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలి



పల్నాడు బ్యూరో, నవంబర్26 (అక్షరభూమి): దుర్గి మండలం ధర్మవరం గ్రామంలో వేంచేసియున్న శ్రీ హరిహర బాల నాగేంద్రస్వామి 36వ వార్షికోత్సవ ఉత్సవాలకు ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డిని ఆలయ కమిటీ సభ్యులు గురువారం ఆహ్వానించారు.వెల్దుర్తి క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డిని ఆలయ కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రికను అందించారు. ఈనెల 26 నుంచి 30వ తేదీ వరకు జరగనున్న వేడుకలకు హాజరవ్వాలని ఎమ్మెల్యేను వారు కోరారు.ఈ కార్యక్రమాలకు సంబంధించిన గోడ ప్రతులను ఎమ్మెల్యే జూలకంటి ఆవిష్కరించారు. ఎమ్మెల్యే జూలకంటి మాట్లాడుతూ స్వామివారి ఉత్సవాలను భక్తులందరూ భక్తి,శ్రద్ధలతో నిర్వహించాలని సూచించారు. గ్రామస్తులందరూ కలిసి ఉత్సవాలను విజయవంతం చేయాలన్నారు. ఎమ్మెల్యేను ఆహ్వానించిన వారిలో జనసేన నాయకులు పులి హరిప్రసాద్, ఆలయ ధర్మకర్త చవిడిశెట్టి కృష్ణయ్య, గుండాల వెంకటేశ్వర్లు, ఆకుల రామ లక్ష్మయ్య పలువురున్నారు.

రాజ్యాంగ విలువలను ప్రతి భారతీయుడు గౌరవిస్తూ బాధ్యతాయుత పౌరుడిగా ముందుకు సాగాలి :ఎమ్మెల్యే గళ్ళా మాధవి



గుంటూరు, నవంబర్ 26. అక్షర భూమి. భారత రాజ్యాంగ విలువలను ప్రతి భారతీయుడు గౌరవిస్తూ బాధ్యతాయుత పౌరుడిగా ముందుకు సాగాలని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి పిలుపునిచ్చారు. మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో 77వ రాజ్యాంగ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్, జాతిపిత మహాత్మా గాంధీ, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు స్వర్గీయ నందమూరి తారక రామారావు విగ్రహాలకు ఎమ్మెల్యే మాధవి, టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ వర్ల రామయ్య, ఎమ్మెల్యే పి.జి.వి.ఆర్. నాయుడు (గణబాబు) పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ప్రధాన కార్యదర్శి పర్వుచారి అశోక్ బాబు, బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ బుచ్చి రామ్ ప్రసాద్, బయోడైవర్సిటీ బోర్డు చైర్మన్ నీలాయపాలెం విజయ్ కుమార్, టీడీపీ సీనియర్ నేత ఎస్.వి.ఎస్.ఎన్. వర్మ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగాఎమ్మెల్యే గళ్ళా మాధవి మీడియాతో మాట్లాడుతూ,ప్రజల కోసం ప్రజలే రూపొందించుకున్న నియమావళి భారత రాజ్యాంగమన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారతదేశం 77వ రాజ్యాంగ దినోత్సవాన్ని జరుపుకోవడం ఎంతో సంతోషకరమన్నారు. కులమతాలకు, ప్రాంతాలకు అతీతంగా ప్రతి భారతీయుడు గర్వంగా జరుపుకోవాల్సిన పండుగలు స్వాతంత్ర్య దినోత్సవం, గణతంత్ర దినోత్సవంతో పాటు రాజ్యాంగ దినోత్సవమని పేర్కొన్నారు. రాజ్యాంగం కేవలం ఒక పుస్తకం కాదని, దేశ ప్రజల హక్కులు, బాధ్యతలు, సమానత్వం, స్వేచ్ఛకు పునాదన్నారు. సమానత్వం, సౌభ్రాతృత్వం, స్వేచ్ఛ, న్యాయం వంటి రాజ్యాంగ మౌలిక విలువలు దేశ ప్రజాస్వామ్య వ్యవస్థకు బలమైన పునాదులని వివరించారు. ఎందరో స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలు, మహనీయుల కృషి, రాజ్యాంగ రూపకర్తల మేధస్సుతో రూపొందిన ఈ పవిత్ర రాజ్యాంగాన్ని ప్రతి భారతీయుడు గౌరవించాలని కోరారు. రాజ్యాంగం కల్పించిన విలువలను ప్రతి ఒక్కరూ తమ జీవితాల్లో ఆచరిస్తూ, వాటిని విస్మరించకుండా ముందుకు సాగాలని ఆమె పిలుపునిచ్చారు.ప్రతి ఒక్కరూ ఒకరినొకరు గౌరవించుకుంటూ, ఇతరుల హక్కులను కాపాడుతూ, జీవించాలని అన్నారు. ప్రతి పౌరుడు తన హక్కులతో పాటు బాధ్యతలను కూడా గుర్తించి, బాధ్యతాయుతమైన భారతీయ పౌరుడిగా దేశ అభివృద్ధిలో భాగస్వామి కావాలని గళ్లా మాధవి ఆకాంక్షించారు.

విధి నిర్వహణలో ఉన్న పోలీస్ సిబ్బంది మృతి పట్ల సంతాపం

- మృతుడి కుటుంబానికి రూ.1 లక్ష ఆర్థిక సహాయం అందజేత





గుంటూరు, నవంబర్ 26. అక్షర భూమి. గుంటూరు జిల్లా వట్టిచెరుకూరు పోలీస్ స్టేషన్‌కు చెందిన, ప్రస్తుతం ఎస్సీ, ఎస్టీ సెల్‌లో అటాచ్‌మెంట్‌పై విధులు నిర్వహిస్తున్న పోలీస్ కానిస్టేబుల్ పచ్చిపాల హరికృష్ణ (పీసీ 3979) అనారోగ్య కారణాలతో మృతి చెందిన విషయం తెలిసిన వెంటనే జిల్లా ఎస్పీ వకుల్ జిందల్,తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రకాశం జిల్లా, గుడ్లూరు మండలం, మోచర్ల గ్రామానికి చెందిన హరికృష్ణ 2009 బ్యాచ్‌కు చెందిన పోలీస్ కానిస్టేబుల్‌గా పోలీస్ శాఖలో సేవలందిస్తున్నారు. ఆయన గురువారం మృతి చెందడం పోలీస్ శాఖకు తీరని లోటన్నారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మంజూరు చేసిన రూ.1,00,000 (ఒక లక్ష రూపాయలు) ఆర్థిక సహాయాన్ని మృతుడి భార్య శిరీషకు పోలీస్ అసోసియేషన్ సభ్యులు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మృతుడి కుటుంబ సభ్యులకు పోలీస్ శాఖ తరఫున ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, వారి కుటుంబానికి పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పోలీసు అసోసియేషన్ జిల్లా జాయింట్ సెక్రెటరీ ఎం. లక్ష్మయ్య, ఎస్సీ, ఎస్టీ సెల్ఎ ఎస్ఐ వెంకటరెడ్డి, పోలీస్ అసోసియేషన్ ఈసీ మెంబర్ కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.

నర్సింగ్ విద్యార్థులకు పాలియేటివ్ కేర్‌పై ప్రత్యేక శిక్షణ కార్యక్రమం



గుంటూరు, నవంబర్ 26. అక్షర భూమి.నర్సింగ్ విద్యార్థులకు పాలియేటివ్ కేర్ (ఉపశమన వైద్యం) పై అవగాహన కల్పించడంతో పాటు, రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని బెటర్ కేర్ -- గ్రేటర్ కంఫర్ట్ విత్ డిగ్నిటీ అనే నినాదంతో గురువారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ దుర్గాప్రసాద్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆసుపత్రిలోని ఎంసీహెచ్ బ్లాక్‌లో ఈ కార్యక్రమం కొనసాగుతోంది. ఈ శిక్షణలో నర్సింగ్ విద్యార్థులకు దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న రోగులకు ఉపశమనం కల్పించడం, నొప్పి నివారణ, రోగులకు మానసికంగా, శారీరకంగా అండగా నిలవడం, గౌరవప్రదమైన వైద్య సేవలు అందించడం వంటి అంశాలపై శిక్షణ అందిస్తున్నారు. రోగుల బాధలను తగ్గించి, వారి జీవన నాణ్యతను మెరుగుపరచడంలో నర్సుల పాత్ర ఎంతో కీలకమని ఈ కార్యక్రమం ద్వారా తెలియజేస్తున్నారు. భవిష్యత్తులో మెరుగైన నర్సింగ్ సేవలు అందించేందుకు ఈ శిక్షణ ఎంతగానో దోహదపడుతుందని నిర్వాహకులు పేర్కొన్నారు.

వృద్ధులు, అనాధలకు దుప్పట్లు పంపిణీ: గుర్రం రాజశేఖర్ రెడ్డి

చలి తీవ్రత నేపథ్యంలో పేదలకు దుప్పట్లు అందజేత



మాచర్ల, నవంబర్26(అక్షరభూమి): మాచర్ల పట్టణంలోని పలువురు వృద్ధులకు, అనాధలకు లయన్స్ క్లబ్ ఆఫ్ మాచర్ల చెన్నకేశవ ఆధ్వర్యంలో గురువారం దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ గుర్రం రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ చలి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో నిరాశ్రయులు, వృద్ధులు, అనాధలకు దుప్పట్లను తమ క్లబ్బు తరఫున పంపిణీ చేశామన్నారు.తమ క్లబ్ ద్వారా సేవా కార్యక్రమాలు చేస్తూ పేదలకు అండగా నిలవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. దుప్పట్లను వితరణ చేసిన డాక్టర్ గుర్రం రాజశేఖర్ రెడ్డికి, క్లబ్ సభ్యులకు పలువురు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు కేశవరెడ్డి, డాక్టర్ వెంకటేష్, శ్రీనివాసరెడ్డి, నాగేశ్వరరావు,సాంబశివరావు, సుబ్బారావు, అంజిరెడ్డి, అనిల్ కుమార్, మల్లారెడ్డి, ఓరుగంటి చెన్నకేశవరావు తదితరులు పాల్గొన్నారు.

సాగర్ కుడి కాలువకు నీటి విడుదల: ఇరిగేషన్ అధికారులు

త్రాగునీటి అవసరాల నిమిత్తం నీరు విడుదల
8 టీఎంసీల నీటిని 10 రోజులపాటు విడుదల చేయనున్న అధికారులు
చెరువులు, కుంటలు నింపుకోవాలంటూ సూచన



మాచర్ల, నవంబర్26 (అక్షరభూమి) : నాగార్జునసాగర్ కుడికాలువ ద్వారా ఇరిగేషన్ అధికారులు గురువారం త్రాగునీటి అవసరాల నిమిత్తం నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఇరిగేషన్ ఈఈ రమేష్ మాట్లాడుతూ త్రాగునీటి అవసరాల నిమిత్తం కుడి జల విద్యుత్ కేంద్రంలో రెండు యూనిట్లను స్విచ్ ఆన్ చేసి నీటిని విడుదల చేశామన్నారు. 8 టీఎంసీల నీటిని దాదాపు 10 రోజులపాటు కుడి కాలువ ద్వారా విడుదల చేయనున్నామన్నారు.కుడి కాలువ పరిధిలోని చెరువులు, కుంటలను ప్రజలు నింపుకొని త్రాగునీటి అవసరాలకు వాడుకోవాలన్నారు. అలాగే మోటార్లతో నీటిని పంట పొలాలకు ఉపయోగిస్తున్నట్లు తమ దృష్టికి వస్తే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. కాగా కుడి జల విద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి ఇప్పటికే మొదలైనట్లు అధికారులు తెలిపారు.ఇరిగేషన్ ఈఈ రమేష్ తో పాటు డిఈ శ్రీకాంత్, జెన్కో అధికారులు, ఇరిగేషన్ సిబ్బంది ఉన్నారు.

సాగర్ ఏపీఆర్జేసీలో రాజ్యాంగ దినోత్సవ వేడుకలు: ప్రిన్సిపల్ హేమాంబర్ రెడ్డి

మాక్ అసెంబ్లీ, రాజ్యాంగ పీఠిక పఠనం నిర్వహణ
రాజ్యాంగం, ప్రజాస్వామ్యంపై విద్యార్థులకు అవగాహన



మాచర్ల, నవంబర్26(అక్షరభూమి): నాగార్జునసాగర్ ఏపీఆర్జేసీలో గురువారం రాజ్యాంగ దినోత్సవ వేడుకలను ప్రిన్సిపల్ హేమాంబర్ రెడ్డి అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలలో విద్యార్థులకు మాక్ అసెంబ్లీ నిర్వహించారు. రాజ్యాంగ పీఠిక పఠనం, ప్రజాస్వామ్యం, రాజ్యాంగం పై విద్యార్థులకు అవగాహన కలిగించారు. ప్రపంచంలోనే అత్యుత్తమమైన భారత రాజ్యాంగాన్ని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రచించారని విద్యార్థులకు ప్రిన్సిపల్ తెలిపారు. భారత రాజ్యాంగం దేశ ప్రజాస్వామ్య వ్యవస్థకు పునాది అని ప్రతి విద్యార్థి రాజ్యాంగ విలువలను గౌరవిస్తూ హక్కులతో పాటు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. అనంతరం న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం వంటి రాజ్యాంగ విలువలను గౌరవిస్తూ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

మాచర్ల ఎమ్మార్వో కార్యాలయంలో క్యూఆర్ కోడ్ స్కానర్ ఏర్పాటు: ఎమ్మార్వో కిరణ్ కుమార్

ప్రజలు తమ అభిప్రాయాలను క్యూఆర్ స్కానర్ ద్వారా తెలియజేయవచ్చు



మాచర్ల, నవంబర్26(అక్షరభూమి): మాచర్ల పట్టణంలోని ఎమ్మార్వో కార్యాలయంలో ప్రజల అభిప్రాయ సేకరణకు క్యూఆర్ కోడ్ స్కానర్ ఏర్పాటు చేసినట్లు ఎమ్మార్వో కిరణ్ కుమార్ గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని ప్రజలు, రైతులు వారి అభిప్రాయాలను క్యూఆర్ స్కానర్ ద్వారా తెలియజేయవచ్చన్నారు. అందులో భాగంగా కంభంపాడుకు చెందిన వెటర్నరీ డాక్టర్ శ్రీనివాసరావు సర్వే నంబర్ 700-డి నందు 2.56 ఎకరాల భూమికి అర్జీ దాఖలపరచగా ఆయనతో అడంగల్ నందు నమోదు చేసి అడంగల్ అందించడమైనందున ఆయన తన అభిప్రాయాన్ని క్యూఆర్ కోడ్ స్కానర్ ద్వారా తెలియజేశారన్నారు. అలాగే కన్నెదారి ధనలక్ష్మి అను మహిళ పట్టణంలోని సర్వేనెంబర్ 669 లో 97 గజాల స్థలం నందు ఇల్లు కలదని సదరు భూమి నిషేధిత భూములు జాబితాలో రోడ్డు అని తప్పుగా నమోదు కాబడి ఉందని ఫిర్యాదు చేసిందన్నారు. తద్వారా రిజిస్ట్రేషన్ జరగడంలేదని సదరు మహిళ అర్జీ దాఖలు చేసిందన్నారు. ఈ క్రమంలో సంబంధిత భూమిని మండల సర్వేయర్ చల్లా శ్రీనివాసరావు సర్వే చేసి నివేదిక తనకు అందించారన్నారు. నివేదిక ప్రకారం సదరు భూమి రిజిస్ట్రేషన్ జరిగినట్లు సంబంధిత మహిళ తన అభిప్రాయాన్ని క్యూఆర్ కోడ్ స్కానర్ ద్వారా తెలిపిందన్నారు. అలాగే పలువురు ప్రజలు, రైతులు వారి అభిప్రాయాలను క్యూఆర్ కోడ్ స్కానర్ ద్వారా తెలియజేయవచ్చని ఎమ్మార్వో తెలిపారు.

సామాన్యులను ప్రజాప్రతినిధులను చేయడం ఒక్క ఆమ్ ఆద్మీ పార్టీకే సాధ్యం

-పార్టీ ఆవిర్భావ దినోత్సవ సభలో డాక్టర్ టి సేవ కుమార్



గుంటూరు, నవంబరు 26 అక్షర భూమి : సామాన్య ప్రజలను రాష్ట్రాలలో, కేంద్రంలో ప్రజాప్రతినిధులను చేయడం ప్రస్తుత పరిస్థితులలో ఒక్క ఆమ్ ఆద్మీ పార్టీకి మాత్రమే సాధ్యమవుతుందని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ టి సేవ కుమార్ అన్నారు .గురువారం ఉదయం స్థానిక బ్రాడీపేట లోని ఎస్ హెచ్ ఓ బిల్డింగ్ లో గల ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆ పార్టీ 14వ ఆవిర్భావ దినోత్సవ సభలోడాక్టర్ టీ సేవకుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు సభకు ఆప్ సీనియర్ నాయకులు రమణబాబు అధ్యక్షత వహించారు . డాక్టర్ టీ సేవ కుమార్ ప్రసంగాన్ని కొనసాగిస్తూ ఢిల్లీలో వరుసగా మూడుసార్లు అధికారం చేపట్టిన ఆమ్ ఆద్మీ పార్టీ ఆ రాష్ట్రంలో ప్రజలకుఅత్యంత ఆర్థికభారంగా మారినవిద్య, వైద్య రంగాలలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చి పేదలను మధ్యతరగతి స్థాయికి ,మధ్యతరగతి ప్రజలను ధనవంతులుగా మార్చిందన్నారు. అలా రాష్ట్ర అభివృద్ధిలో తోడ్పడడం ఆప్ కే సాధ్యమైందన్నారు. ఇప్పుడు అధికారంలో ఉన్న పంజాబ్ రాష్ట్రంలో కూడా విద్య వైద్య రంగంలో ఎన్నో మార్పులు తీసుకువచ్చింది అన్నారు . గత ప్రభుత్వాలు చేసిన అప్పుల ఊబిలోంచి రాష్ట్రాన్ని బయటపడేసే ప్రయత్నం జరుగుతోందన్నారు . దేశంలోఅతి తక్కువ కాలంలోనే కేంద్రఎన్నికల సంఘం గుర్తింపు పొందిన జాతీయ పార్టీగా ఎదగడం ప్రజాసంక్షేమ పాలన ద్వారానే సాధ్యమైంది అన్నారు .పోటీ చేసిన తొలి ఎన్నికలలోనే ఆప్ లోక్ సభలోఅడుగుపెట్టడం జరిగిందన్నారు. ఇప్పుడు రాజ్యసభలో కీలక పాత్ర పోషిస్తుందన్నారు . పన్నుల రూపంలో వస్తున్న ప్రజల ధనం ...ప్రతి పైసాకు ...ప్రజల ,రాష్ట్ర అభివృద్ధికి పూర్తిగాఖర్చు చేసే పార్టీ దేశంలో ఆప్ ఒకటేనన్నారు. అందులో సందేహాలు ఉంటే ఢిల్లీ, పంజాబ్ రాష్ట్రాలను అధ్యయనం చేయాలన్నారు. రాజ్యాంగం ఏ విధంగా ఉన్నా ,దాన్ని అమలు జరిపే వ్యక్తులపైనే ఫలితాలు, ప్రజాస్వామ్యం ఆధారపడి ఉంటాయని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆనాడే చెప్పారన్నారు. ప్రస్తుతం పరిస్థితుల్లో ఆనుగుణంగా రాజ్యాంగంలో ప్రజాహిత సంస్కరణల అవసరమన్నారు .అయితే ఇప్పుడు జరుగుతున్న సంస్కరణలు ప్రజల కోసం కాకుండా పాలకుల కోసం జరుగుతున్నాయన్నారు. అలాంటి సంస్కరణలను నిరోధించేందుకు ఓటర్లు చైతన్యవంతులు కావాలన్నారు .అత్యంత విలువైన ,పదునైన ,ప్రభావవంతమైన ఓటు అనే ఆయుధం ద్వారానే ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవాలన్నారు. ఓటు వేసేటప్పుడు రాష్ట్రం, దేశం అభివృద్ధికి కృషి చేసే వారినే ఎన్నుకోవాలి అన్నారు. కులం ,పార్టీ, మతం ,మద్యం ,డబ్బు వంటి ప్రలోభాలకు లొంగి ఓటు వేస్తే దేశం, రాష్ట్రం భవిష్యత్తుపై ఆ ప్రభావం తీవ్రంగా ఉంటుందన్నారు. ప్రజల జీవన పరిస్థితులు అతలా కుతలం అవుతాయన్నారు .ప్రజలు విజ్ఞత తోఆలోచించి మంచి ప్రజాప్రతిని ఎన్నుకోవాలి అన్నారు .సభలో పాల్గొన్న రాజ్యాంగ చర్చా వేదిక కార్యదర్శి అవధానుల హరి మాట్లాడుతూ రాజ్యాంగ పరిరక్షణలో పాలకులకు చిత్తశుద్ధి ఉండాలన్నారు. అలాంటి పాలకులను ఎన్నుకుంటే ప్రజాస్వామ్యం ఫలిస్తుందన్నారు .పాలకులు ఎవరు అధికారంలో ఉంటే వారు తమ కనుగుణంగా రాజ్యాంగంలో మార్పులు చేస్తున్నారన్నారు. ఆ మార్పులు ప్రజాహితం కావాలి కానీ పాలకుల వ్యక్తిగత ప్రయోజనాల కోసం కాకుండా ఉండాలన్నారు .సభలో పాల్గొన్న స్వచ్ఛంద సమాజ సేవకులు వల్లూరి సదాశివరావు మాట్లాడుతూ ప్రజల కట్టిన పన్నులతోనే ప్రభుత్వాలు నడుస్తాయని అన్నారు. ప్రజాధనానికి జవాబిదారితనంచూపే ప్రభుత్వాలు రావాలన్నారు. అలాంటి ప్రజాప్రతినిధులను ప్రజలు ప్రలోభాలకు లొంగకుండా ఎన్నుకోవాల్సిన బాధ్యత ఓటర్ ల పైన ఉందన్నారు. సమావేశంలో ఆమ్ ఆద్మీ పార్టీ సీనియర్ నాయకులు, ప్రజాసంఘాల నాయకులు పలువురు పాల్గొన్నారు.

డిఆర్ఎం ఆధ్వర్యంలో 'టిఓ ఎల్ఐసి' అర్ధ వార్షిక సమావేశం



గుంటూరు, నవంబర్ 26. అక్షర భూమి. "అన్ని భాషల అభివృద్ధి ద్వారా మాత్రమే హిందీ అభివృద్ధి సాధ్యమవుతుంది" అనే ఇతివృత్తంతో గుంటూరు పట్టణ అధికార భాషా అమలు కమిటీ (టి ఓఎల్ఐసి) అర్ధవార్షిక సమావేశం గురువారం జరిగింది. ఈ సమావేశానికి టిఓ ఎల్ఐసి /గుంటూరు ఛైర్పర్సన్, గుంటూరు డివిజనల్ రైల్వే మేనేజర్ సుదేష్నా సేన్ అధ్యక్షత వహించారు. ఈ సమావేశానికి వైస్-ఛైర్పర్సన్, గుంటూరు అదనపు డివిజనల్ రైల్వే మేనేజర్ ఎం. రమేష్ కుమార్, గుంటూరు నగరంలోని అన్ని సభ్య కార్యాలయాలు, బ్యాంకుల కార్యాలయాధిపతులు, అధికార భాషా అధికారులు/ప్రతినిధులు హాజరయ్యారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డిప్యూటీ జనరల్ మేనేజర్ ఆతిథ్యంలో, ఈ సమావేశం గుంటూరులోని కన్నవారి తోటలో ఉన్న స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పరిపాలనా కార్యాలయంలో నిర్వహించారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధికార భాషా అధికారి అమృత్‌రాజ్ థాపా స్వాగతోపన్యాసంతో సమావేశం ప్రారంభమైంది. గుంటూరు, టోలిక్ ఛైర్పర్సన్ సుదేష్నా సేన్, అన్ని సభ్య కార్యాలయాల అధిపతులకు, అధికార భాషా అధికారులకు, హిందీ ప్రతినిధులకు స్వాగతం పలికారు.ఛైర్పర్సన్ అనుమతితో, గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను, వాటి అమలు నివేదికను కమిటీకి సమర్పించారు. గత ఆరు నెలలుగా సభ్య కార్యాలయాల నుండి అందిన అర్ధవార్షిక నివేదికలను సమీక్షించి, అధికార భాషా విధానాలు మరియు నియమాలపై అందరికీ వివరించారు.అధికార భాషను సమర్థవంతంగా అమలు చేయడం అన్ని సభ్య కార్యాలయాల సమిష్టి బాధ్యత అని టోలిక్ ఛైర్పర్సన్ సుదేష్నా సేన్ పేర్కొన్నారు. తమతమ కార్యాలయాలలో హిందీ వినియోగాన్ని ప్రోత్సహించాలని, అధికార భాషా నియమాలను సక్రమంగా పాటించేలా చూడాలని ఆమె కార్యాలయ అధిపతుల ందరినీ కోరారు. అన్ని భాషల అభివృద్ధి ద్వారానే హిందీ అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొంటూ, ప్రాంతీయ భాషల వినియోగానికి ప్రాధాన్యత ఇవ్వాలని కూడా ఆమె పిలుపునిచ్చారు.సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధికార భాషా అధికారి శ్యామ్ ప్రకాష్ పాండే వందన సమర్పణతో ఈ సమావేశం ముగిసింది.

ఓట్ల లెక్కింపు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలి: కలెక్టర్ వినోద్ కుమార్



బాపట్ల(అక్షర భూమి)26.11.26 గ్రామ పంచాయతీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి వినోద్ కుమార్ వి ఓట్ల లెక్కింపు అధికారులకు తెలిపారు. గురువారం, 2వ సాధారణ స్థానిక సంస్థల గ్రామపంచాయతీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియను ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా తొలుత మార్టూరు మండలం,బొల్లాపల్లి గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో సర్పంచ్ పదవికి సంబంధించిన ఓట్ల లెక్కింపు ప్రక్రియను జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి వినోద్ కుమార్, వి పరిశీలించారు. బొల్లాపల్లి గ్రామంలో ఓటర్ల సంఖ్య, నమోదైన పోలింగ్ శాతం, వార్డు సభ్యుల ఓట్ల లెక్కింపు,సర్పంచ్ గా పోటీ చేసిన అభ్యర్థుల వివరాలపై ఆయన పంచాయతీ సెక్రెటరీని ఆరా తీశారు. అనంతరం ఇంకొల్లు మండలం, దుద్దుకూరు గ్రామం, ఆచార్య రంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రంలో పంచాయతీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియను జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్ వి పరిశీలించారు. ఓట్ల లెక్కింపు కేంద్రంలో సిబ్బంది కి ఏర్పాటుచేసిన మౌలిక వసతులపై ఆయన ఆరా తీశారు.ఈ సందర్భంగా ఓట్ల లెక్కింపు ప్రక్రియ సజావుగా, పారదర్శకంగా, ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో మార్టూరు మండలం ఎన్నికల రిటర్నింగ్ అధికారి కరుణ శ్రీ, మార్టూరు తాహసిల్దార్ ప్రశాంతి, పంచాయతీ సెక్రెటరీ బి లక్ష్మి, ఇంకొల్లు తహసిల్దార్ ఏవీఎస్ శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

జాతీయ పాల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించిన సంగం డెయిరీ

క్షీరవిప్లవ పితామహుడు డాక్టర్ వర్గీస్ కురియన్ సేవలను స్మరించుకున్న డెయిరీ యాజమాన్యం



గుంటూరు, నవంబరు 26 అక్షర భూమి : క్షీరవిప్లవ పితామహుడు డాక్టర్ వర్గీస్ కురియన్ 105వ జయంతిని పురస్కరించుకొని సంగం డెయిరీ ఆధ్వర్యంలో గురువారం జాతీయ పాల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సంగం డెయిరీ మేనేజింగ్ డైరెక్టర్ పి. గోపాలకృష్ణన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ పి. సాంబశివరావు, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ పి. అనిల్ కుమార్, డాక్టర్ ఆలపాటి సత్యనారాయణతో పాటు డెయిరీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.ఈ సందర్భంగా డాక్టర్ వర్గీస్ కురియన్‌తో తనకున్న అనుబంధాన్ని, ఆయన దేశానికి అందించిన సేవలను మేనేజింగ్ డైరెక్టర్ గోపాలకృష్ణన్ గుర్తుచేసుకున్నారు. నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డు (ఎన్‌డీడీబీ), గుజరాత్ కో-ఆపరేటివ్ మిల్క్ మార్కెటింగ్ ఫెడరేషన్ వ్యవస్థాపక ఛైర్మన్‌గా కురియన్ అందించిన సేవలను కొనియాడారు. దేశవ్యాప్తంగా పాడి పరిశ్రమ అభివృద్ధికి పాల వెల్లువ పథకాన్ని అమలు చేసిన తీరు చిరస్మరణీయమని పేర్కొన్నారు.పాల వెల్లువ పథకం అమలుకు దేశవ్యాప్తంగా ఎంపిక చేసిన 18 జిల్లాల్లో గుంటూరు జిల్లా కూడా ఒకటిగా ఉండటం గర్వకారణమన్నారు. 1981లో వరల్డ్ ఫుడ్ ప్రోగ్రామ్ ఆధ్వర్యంలో డాక్టర్ కురియన్ సంగం డెయిరీని సందర్శించిన సందర్భాన్ని గుర్తుచేసుకున్నారు. అప్పటి డెయిరీ అభివృద్ధికి ఆయన అందించిన సహకారాన్ని, శ్రీ ధూళిపాళ్ల వీరయ్య చౌదరితో ఆయనకున్న అనుబంధాన్ని స్మరించుకున్నారు.డాక్టర్ వర్గీస్ కురియన్ జన్మదినమైన నవంబరు 26ను జాతీయ పాల దినోత్సవంగా ప్రతి ఏడాది సంగం డెయిరీ ఛైర్మన్ ధూళిపాళ్ల నరేంద్రకుమార్ ఆధ్వర్యంలో నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని తెలిపారు. దేశంలో పాడి పరిశ్రమ అభివృద్ధికి కురియన్ చేసిన కృషి, రైతుల ఆర్థిక పురోగతికి ఆయన అందించిన తోడ్పాటు ఎప్పటికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.

కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షించిన ఎస్పీ ఉమామహేశ్వర్



బాపట్ల(అక్షర భూమి)
26.11.26 అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి ఎన్నికల ప్రక్రియను పరిశీలించిన జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్ .బాపట్ల మున్సిపాలిటీతో పాటు పర్చూరు నియోజకవర్గంలోని 95 పంచాయతీలలో మొదటి దశ పంచాయతీ ఎన్నికలు గురువారం జరుగుతున్న నేపథ్యంలో జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్ ఆదేశాల మేరకు క్యాంపు కార్యాలయంలో కమ్యూనికేషన్, ఐటీ, సమాచార విభాగాలను ఒకే చోట కేంద్రీకరించి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన కమాండ్ కంట్రోల్ రూమ్‌ను పోలీస్ అధికారులు ఏర్పాటు చేశారు. గురువారం కంట్రోల్ రూమ్ నుంచి ఎస్పీ ఎన్నికల ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించారు.కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా 'సమర్థ్' యాప్‌లోని రియల్ టైమ్ లొకేషన్ ఆధారంగా సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ, రూట్ మొబైల్స్, ట్రైకింగ్ ఫోర్స్, స్పెషల్ స్ట్రైకింగ్ బృందాలను అప్రమత్తం చేస్తున్నారు. ఎక్కడైనా ఏదైనా సమస్య తలెత్తిన వెంటనే సంబంధిత పోలీస్ బృందాలు సంఘటనా స్థలానికి చేరుకుని శాంతిభద్రతలను పరిరక్షించేలా చర్యలు చేపట్టారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ.. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం వల్ల ఎక్కడైనా శాంతిభద్రతల సమస్యలు తలెత్తినప్పుడు క్షణాల్లో స్పందించి, పోలీస్ బలగాలను సంఘటనా స్థలానికి పంపించి శాంతిభద్రతలను పరిరక్షించగలుగుతున్నామని తెలిపారు.ఎన్నికల విధులు నిర్వహిస్తున్న పోలీస్ అధికారులు, సిబ్బంది అందరి లైవ్ లొకేషన్‌ను సమర్థ్ యాప్ ద్వారా నిరంతరం ట్రాక్ చేశామన్నారు. ఏదైనా అవాంఛనీయ ఘటన చోటుచేసుకున్నప్పుడు సంబంధిత ప్రాంతంలో విధులు నిర్వహిస్తున్న పోలీసులు యాప్‌లోని ఎస్ ఓ ఎస్ బటన్‌ను నొక్కితే, సమీపంలోని రూట్ మొబైల్ పార్టీలు, ట్రైకింగ్ ఫోర్స్, స్పెషల్ ట్రైకింగ్ ఫోర్స్ అధికారులకు వెంటనే సమాచారం అందుతుందని వివరించారు. దీంతో ఆయా పోలీస్ బృందాలు నిమిషాల వ్యవధిలోనే సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చి శాంతిభద్రతలను పరిరక్షిస్తున్నాయని పేర్కొన్నారు.ఎన్నికల ప్రక్రియ జరుగుతున్న సమయంలో, ఓట్ల లెక్కింపు సమయంలో గొడవలు, ఘర్షణలకు పాల్పడుతూ శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై చట్టపరిధిలో కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. సాధారణ సమయాలతో పోలిస్తే ఎన్నికల సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై తీసుకునే చర్యలు మరింత కఠినంగా ఉంటాయని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ తో పాటు ఎలక్షన్ సెల్ సీఐలు సూర్యనారాయణ, శ్రీనివాసరావు, ఎస్బీ సీఐ నారాయణ, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఈనెల 30న పింఛన్ల పంపిణీ : జిల్లా కలెక్టర్



గుంటూరు, నవంబరు 26, అక్షర భూమి సామాజిక భద్రత పింఛన్లను ఈ నెల 30వ తేదీన పంపిణీ జరుగుతుందని జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ తెలిపారు. ఈ మేరకు సంబంధిత అధికారులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పింఛను సొమ్మును విత్ డ్రా చేయుటకు మండల పరిషత్ అభివృద్ధి అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. 30వ తేదీన పంపిణీకాని వారికి పట్టణ ప్రాంతాల్లోను, రెండవ దశ గ్రామ పంచాయతీ ఎన్నికలు జరిగే పొన్నూరు, చేబ్రోలు, పెదకాకాని, తెనాలి, కొల్లిపర మండలాలలో డిసెంబరు 1 నుండి 4వ తేదీ వరకు, మూడవ దశ గ్రామ పంచాయతీ ఎన్నికలు గల ప్రత్తిపాడు, పెదనందిపాడు, వట్టిచెరుకూరు, గుంటూరు రూరల్, కాకుమాను, దుగ్గిరాల, మేడికొండూరు, పిరంగిపురం మండలాలలో డిసెంబరు 3, 4 తేదీల్లో పంపిణీ చేయాలని ఆదేశించారు. ఈ మేరకు స్పష్టమైన కార్యాచరణ ప్రణాళికను మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మునిసిపల్ కమిషనర్లు రూపొందించుకోవాలని ఆదేశించారు. స్వర్ణ గ్రామ స్వర్ణ వార్డు సిబ్బంది అందరికీ స్పష్టమైన సూచనలు జారీ చేసి పర్యవేక్షించాలని అన్నారు. పంపిణీ సమయంలో యథావిధిగా నిర్దేశిత మార్గదర్శకాలు పాటించాలన్నారు.

బాలుడి కుటుంబానికి ఎమ్మెల్యే నసీర్ పరామర్శ



గుంటూరు నవంబర్ 26. అక్షర భూమి గుంటూరు నందివెలుగు రోడ్డు సమీపంలో ఉన్న చిన్నేరు కుంటలో చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తూ నీటిలో పడి మృతి చెందిన బాలుడి కుటుంబాన్ని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ గురువారం పరామర్శించారు. బాలుడి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుమారుడిని కోల్పోయి దుఃఖంలో ఉన్న తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కష్ట సమయంలో బాధిత కుటుంబానికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.బాలుడి మృతి విషయం తెలిసిన వెంటనే ఎమ్మెల్యే నసీర్ జిల్లా కలెక్టర్, ఆర్డీవోతో పాటు సంబంధిత రెవెన్యూ, మున్సిపల్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. సహాయక చర్యలను పర్యవేక్షించాలని, బాధిత కుటుంబానికి ప్రభుత్వపరంగా అందాల్సిన సహాయం తక్షణం అందేలా చూడాలని సూచించారు.బాలుడి అంత్యక్రియలు, మట్టి ఖర్చుల నిమిత్తం తనవంతు సహాయంగా రూ.10 వేల నగదును కుటుంబ సభ్యులకు అందజేశారు. మరోవైపు చిన్నేరు కుంట వద్ద ప్రమాదాలు జరగకుండా కుంట చుట్టూ పటిష్టమైన ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తక్షణ భద్రతా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ కోట పిచ్చిరెడ్డి, కూటమి నాయకులు అన్వర్, యడ్ల మల్లి, దిలీప్, పఠాన్ జమీర్, ముప్పా శైలజ పాల్గొన్నారు.

వైద్య సేవల్లో డిజిటల్ సాంకేతికతను సమర్థవంతంగా వినియోగించాలి: డి ఎం హెచ్ ఓ డాక్టర్ యం. పద్మావతి



గుంటూరు, నవంబర్ 26. అక్షర భూమి.గుంటూరు జిల్లాలో నేషనల్ హెల్త్ మిషన్ ఆధ్వర్యంలో అమలు చేస్తున్న సంజీవని కార్యక్రమంలో భాగంగా జిల్లా లోని పట్టణ మరియు గ్రామీణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలోని వైద్యాధికారులు గుర్తించిన సంజీవని మిత్రులకు నిర్వహించిన రెండు రోజుల శిక్షణా కార్యక్రమాలు మూడు బ్యాచ్ లు గురువారంతో విజయవంతంగా ముగిశాయి.ఈ శిక్షణా కార్యక్రమాలు నవంబర్ 20--21, 23--24, 25--26 తేదీలలో మూడు బ్యాచ్‌లుగా గుంటూరు జిల్లా నంబూరు గ్రామంలోని వివిఐటి విశ్వవిద్యాలయం లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంజీవని పథకం లక్ష్యాలు, విధివిధానాలు, ప్లాట్‌ఫారమ్ వినియోగం, డిజిటల్ ఆరోగ్య సేవలు, రోగుల నమోదు, ఆరోగ్య సేవల నిర్వహణ తదితర అంశాలపై శిక్షణనిచ్చారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిణి డాక్టర్ యం. పద్మావతి మాట్లాడుతూ, సంజీవని కార్యక్రమం ద్వారా ప్రజలకు మరింత నాణ్యమైన, సులభతరమైన, సమర్థవంతమైన వైద్య సేవలను అందించేందుకు డిజిటల్ సాంకేతికతను ఆరోగ్య రంగంలో విస్తృతంగా వినియోగించుకోవడం ముఖ్యమని తెలిపారు. శిక్షణ పొందిన వైద్యాధికారులు, సంజీవని మిత్రలు తమ తమ ఆరోగ్య కేంద్రాలలో సంజీవని విధానాలను సమర్థవంతంగా అమలు చేస్తూ, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను క్షేత్రస్థాయిలో ఆచరణలో పెట్టి, రోగుల సేవల్లో వేగం, పారదర్శకత, నాణ్యత పెంపొందించాలని ఆమె కోరారు. సంజీవని కార్యక్రమం ఆరోగ్య సేవల డిజిటలైజేషన్‌లో కీలక ముందడుగు అని, వైద్య సిబ్బంది సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేయాలని డి ఎం హెచ్ ఓ ఆకాంక్షించారు. ముగింపు కార్యక్రమంలో శిక్షకులు,డాక్టర్ కె.సుజాత డీ పి యం ఓ,టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్, డిస్ట్రిక్ట్ లీడ్ సుష్మ డిసౌజా పాల్గొన్నారు.

Printed, Published and Owned by Billa Raju, D.No : 6-12-51/A, Arundelpet, 12/1, Guntur - 522002, Printed at Sowmya Graphics, D.no : 26-36-72, Ankamma Nagar, Guntur